1 St Year Happy Work Anniversary.

షణ్ముఖ SHANMUKHAVELUGU

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health — Best for Readers — THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 236 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శుక్రవారం 25 జూలై 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 236 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Friday 25 July 2025 PAGES : 8 PRICE : 3/-


# ఏడాదిలో పెట్టుబడుల లక్ష్యం

# రూ.10 లక్షల కోట్లు

- ప్రాజెక్టులకు ఫెసిలిటేటర్‌గా వ్యవహరిస్తా
- సీఎంవో నుంచే పర్యవేక్షణ
- ఇన్వెస్టోపియా గ్లోబల్ ఏపీ-2025 లో సీఎం చంద్రబాబు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 24)

ఇన్వెస్టోపియా గ్లోబల్ ఏపీ-2025 సదస్సు సందర్భంగా ఏపీఈడీబీ, ఇన్వెస్టోపియా మధ్య కుదిరిన అవగాహన ఒప్పంద పత్రాలతో సీఎం చంద్రబాబు, యూఏఈ ఆర్థిక, పర్యాటకశాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్‌మారి. చిత్రంలో టాటా కెమికల్స్ లిమిటెడ్ సీఈఓ, ఎండీ ఆర్.ముకుందన్, మంత్రి భరత్, ఇన్వెస్టోపియా సీఈఓ జీన్‌ఫేర్స్, ఏపీఈడీబీ సీఈఓ సాయికాంత్, లులు ఇంటర్నేషనల్ ఛైర్మన్, ఎండీ యూసుఫ్ అలీ, సీఎస్ విజయానంద్

ఏడాదిలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలన్నదే లక్ష్యమని..అందుకు అనుగుణంగా 15 రంగాల్లో పాలసీలు తీసుకొచ్చినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కు చెందిన ఇన్వెస్టోపియా, ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఏపీ ఈడీబీ )భాగస్వామ్యంతో విజయవాడలో బుధవారం నిర్వహించిన ఇన్వెస్టోపియా గ్లోబల్ ఏపీ-2025 సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

'యూఏఈ నుంచి అమరావతి సహా ఇతర చోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆహ్వానిస్తున్నాం. ఏపీని పరిశీలించిన తర్వాతే పెట్టుబడులపై నిర్ణయం తీసుకోండి. ప్రాజెక్టుల సాకారం కోసం ఫెసిలిటేటర్‌గా నేనే వ్యవహరిస్తా' అని పేర్కొన్నారు. రెండు ప్రాంతాల మధ్య వాణిజ్య బంధాన్ని బలోపేతం చేసేందుకు వీలుగా 'ఏపీఈడీబీ- ఇన్వెస్టోపియా' మధ్య అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో యూఏఈ ఆర్థిక, పర్యాటకశాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మారి, లులు గ్రూప్ ఛైర్మన్ యూసుఫ్ అలీ, ఇన్వెస్టోపియా సీఈఓ జీన్‌ఫేర్స్, రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీజీ భరత్, -మిగతా 2లో

## ఆ ఒప్పందం భారీ విజయం మోదీ పర్యటన వేళ బ్రిటన్ ప్రధాని వ్యాఖ్యలు



(షణ్ముఖ వెలుగు,ఢిలీ,జూలై 24)

ప్రధాని నరేంద్రమోదీ ప్రస్తుతం బ్రిటన్‌లో పర్యటిస్తున్నారు . ఈసందర్భంగా రెండు దేశాల మధ్య చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇది తమ దేశానికి దక్కిన భారీ విజయమని అభివర్ణించారు. దీనిద్వారా వేలాది మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. వ్యాపారాలకు కొత్తదారులు తెరుచుకుంటాయని, అభివృద్ధి సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అంశంపై ఇరుదేశాల మధ్య మూడేళ్లుగా చర్చలు జరుగుతున్నాయి . బోరిస్ జాన్సన్ ప్రధానిగా ఉన్నప్పటినుంచి ఇరుదేశాల మధ్య చర్చలు నడుస్తూ వచ్చాయి. స్వేచ్ఛా మార్కెట్, వాణిజ్య ఆంక్షలు సడలించడం ద్వారా 2040 నాటికి ఇరుదేశాల వాణిజ్యాన్ని 25.5 బిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా పలు దఫాలుగా చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. ఒప్పందంలో భాగంగా భారత్ నుంచి ఎగుమతయ్యే 99 శాతం ఉత్పత్తులకు జీరో టారిఫ్ వర్తిస్తుంది.

అలాగే, బ్రిటన్ నుంచి భారత్‌కు దిగుమతయ్యే విస్కీపై సుంకం 150 శాతం నుంచి 75 శాతానికి తగ్గనుంది . నిర్దేశిత కోటా మేరకు ఆటోమొబైల్ దిగుమతుల సుంకం 100 శాతం నుంచి 10 శాతానికి తగ్గనుంది. వీటితో పాటు వైద్య పరికరాలు, అధునాతన మెషినరీ పరికరాలు, చాక్లెట్లు, బిస్కెట్లపై టారిఫ్‌లను భారత్ తగ్గించనుంది. అలాగే, సామాజిక భద్రత ఒప్పందంలో భాగంగా బ్రిటన్‌లో పనిచేసే భారతీయులు సోషల్ సెక్యూరిటీ ఫండ్స్ కింద రెట్టింపు చెల్లింపు చేయాల్సిన అవసరం తప్పుతుంది. -మిగతా 2లో

## పవనన్న సినిమా కోసం ఎదురుచూస్తున్నా: మంత్రి లోకేశ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 24)

'పవనన్న, ఆయన సినిమాలు, స్వాగ్ నాకు చాలా చాలా ఇష్టం. పవర్‌స్టార్ పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో హరిహర వీరమల్లు అద్భుత విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని లోకేశ్ పేర్కొన్నారు. హరిహర వీరమల్లు విడుదల సందర్భంగా బుధవారం ఎక్స్ వేదికగా చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. పవర్‌స్టార్ అభిమానుల్లాగే తానూ ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్నట్లు చెప్పారు.



## మద్యం కుంభకోణం.. ప్రజలకు జగన్ సూటిగా సమాధానం చెప్పాలి: షర్మిల

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 24)

వైకాపా హయాంలో జరిగిన మద్యం కుంభకోణం వెనుక కుట్రలను పూర్తిగా వెలికితీయాలని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. ఇది ఓ ఆర్థిక నేరమని.. బ్లాక్ మనీ కోసమే డిజిటల్ పేమెంట్‌ను నిలిపివేశారని ఆరోపించారు. ప్రజలకు మాజీ సీఎం జగన్ సూటిగా సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. గన్నవరం విమానాశ్రయంలో మీడియాతో షర్మిల మాట్లాడారు. "మద్యం కుంభకోణంలో తయారీ నుంచి చివరి కొనుగోలు వరకు అవినీతి జరిగిందని అర్థమవుతోంది. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఈ డిజిటల్ యుగంలోనూ కేవలం నగదు రూపంలో అమ్మకాలు చేశారు. రూ.3500 కోట్ల మద్యం స్కాం మాత్రమే కాదు.. పన్నులు ఎగ్గొట్టాలని క్యాష్‌తోనే అమ్మకాలు చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై పూర్తి విచారణ జరగాలి. నాన్ డ్యూటీ పేమెంట్‌లు మొత్తం బ్లాక్‌లో జరిగాయి. బ్రాండెడ్ మద్యాన్ని నిలిపివేసి.. చీప్ లిక్కర్‌ను ఎందుకు ప్రోత్సహించారు?ఇదంతా కుట్రతో జరిగింది. ఐదేళ్లలో 30లక్షల -మిగతా 2లో



## పాకిస్థాన్ కవ్వింపు చర్యలు.. 6 డ్రోన్లను కూల్చివేసిన భారత్

సరిహద్దుగుండా ఆయుధాలు, మత్తు పదార్థాలు దేశంలోకి పంపించేందుకు పాక్ కుట్ర

(షణ్ముఖ వెలుగు,ఢిలీ,జూలై 24)

పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. తాజాగా పంజాబ్‌లోని అమృత్‌సర్ సమీపంలో భారత్-పాకిస్థాన్ సరిహద్దు గుండా ఆయుధాలు, మత్తు పదార్థాలను మన దేశంలోకి పంపించేందుకు కుట్ర పన్నింది. ఈ క్రమంలో పాకిస్థాన్ పంపించిన ఆరు డ్రోన్లను బీఎస్ఎఫ్ కూల్చివేసింది. ఈ ఘటనలో మూడు తుపాకులు, మ్యాగజీన్లతో పాటు ఒక కిలో హెరాయిన్‌ను స్వాధీనం చేసుకుంది.

ఈ మేరకు బీఎస్ఎఫ్ అధికారులు మీడియాకు వివరాలు వెల్లడించారు. బుధవారం రాత్రి అనుమానాస్పద వస్తువులు భారత్ భూభాగంలోకి వస్తున్నట్లు గుర్తించిన బీఎస్ఎఫ్ సిబ్బంది అప్రమత్తమైంది. అవి పాక్‌కు చెందిన డ్రోన్లుగా గుర్తించి వెంటనే ప్రతిస్పందించి వాటిని కూల్చివేసింది.



మోథే సమీపంలో ఐదు డ్రోన్లను కూల్చిన బీఎస్ఎఫ్, మూడు తుపాకులు, మూడు మ్యాగజీన్‌లు, దాదాపు 1.07 కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకుంది. గురువారం తెల్లవారుజామున అట్టారీ దాల్ గ్రామానికి సమీపంలో మరొక డ్రోన్‌ను కూల్చివేశారు. వీటితో పాటు దాల్ సమీపంలోని పంట పొలాల్లో తుపాకీ విడిభాగాలు, ఒక మ్యాగజీన్‌ను గుర్తించారు.

## చంద్రబాబు మాటలు విజయ సంకేతాలు

### డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 24)

'గత పదేళ్లలో సీఎం చంద్రబాబుతో పలుమార్లు సమావేశమైనా ఎప్పుడూ సినిమాల ప్రస్తావన రాలేదు. ఈ రోజు హరిహర వీరమల్లు చిత్ర విజయాన్ని కాంక్షించినందుకు ఆయనకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఆ మాటలు విజయ సంకేతాలు. నా బాధ్యతలు నిర్వర్తిస్తూనే.. సినిమాలో నటించే వెసులుబాటు కల్పించారు' అని హరిహర వీరమల్లు సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సీఎం చంద్రబాబు పెట్టిన పోస్టుపై పవన్ కల్యాణ్ స్పందించారు.

## శాంతికి ప్రత్యామ్నాయం లేదు.. కాల్పుల విరమణ జరగాల్సిందే: భారత్

(షణ్ముఖ వెలుగు,ఢిలీ,జూలై 24)

దాడుల్లో గాజా విలవిల్లాడుతోంది. ఆ ప్రాంతంలో మానవతా సాయానికి తీవ్ర ఆటంకం నెలకొంది. ఈక్రమంలో అక్కడ నెలకొన్న మానవతా సంక్షోభంపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. తక్షణమే కాల్పుల విరమణ జరగాల్సిందేనని ఉద్ఘాటించింది. గాజా సంఘర్షణపై ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో చర్చ జరిగింది. ఇందులో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ మాట్లాడుతూ.. ఆహారం, ఇంధన కొరతతో పాటు వైద్య సేవలు సరిపోకపోవడం, విద్య అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలతో రోజూ గాజా ప్రజలు మానవతా సవాళ్లను ఎదుర్కొంటున్నారన్నారు. వాటిని పరిష్కరించడానికి అడపాదడపా చేసే కాల్పుల విరామాలు సరిపోవన్నారు. సురక్షితమైన ప్రదేశంలో.. సకాలంలో మానవతా సాయం అందించాల్సిన అవసరం ఉందని హరీశ్ నొక్కి చెప్పారు. శాంతికి ప్రత్యామ్నాయం లేదని, కాల్పుల విరమణ జరగాల్సిందేనని పిలుపునిచ్చారు. ఈ సమస్యలన్నిటికీ పరిష్కారాలన్నీ దౌత్య మార్గాల్లోనే జరగాలని సూచించారు. ఇక, పాలస్తీనా ప్రజలకు భారత్ ఎప్పుడూ మద్దతుగా నిలిచిందని, వారిపై మా నిబద్ధత అచంచలమైనదని హరీశ్ అన్నారు. పాలస్తీనా స్వతంత్రదేశమని గుర్తించిన మొదటి అరబ్‌యేతర దేశం భారత్ అని ఆయన గుర్తు చేశారు. గాజాలోని అన్ని ఆస్పత్రులు 95శాతం దెబ్బతిన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసిందన్నారు. మానవ -మిగతా 2లో



## భారతీయులను నియమించుకోవద్దు.. టెక్ సంస్థలకు ట్రంప్ వార్నింగ్




(షణ్ముఖ వెలుగు,ఢిలీ,జూలై 24)

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి టెక్ సంస్థలకు భారతీయులను నియమించుకోవద్దంటూ వార్నింగ్ ఇచ్చారు. అమెరికన్లపై దృష్టిసారించాలని సూచించారు. లేనిపక్షంలో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ మేరకు నిన్న వాషింగ్టన్ డీసీలో జరిగిన ఏఐ సదస్సులో ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా టెక్ కంపెనీల ప్రపంచవాద ధోరణిని ఆయన తీవ్రంగా విమర్శించారు. చాలామంది అమెరికన్లు తమను పట్టించుకోవడం లేదన్న భావనలో ఉన్నారని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికాలో లభించిన స్వేచ్ఛను వాడుకొని చాలా టెక్ సంస్థలు ఇతర దేశాల్లో పెట్టుబడులు పెడుతున్నాయని, తన పాలనలో ఆ రోజులు ముగిసిపోతాయని హెచ్చరించారు. -మిగతా 2లో

## ఏపీ ఎలక్ట్రానిక్స్ తయారీ పాలసీకి క్యాబినెట్ ఆమోదం.. వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 24)

పెట్టుబడులకు గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం పాలసీలను రూపొందిస్తోందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. -మిగతా 2లో



## ధన్‌ఖడ్‌కు వీడ్కోలు పలుకుదామన్న కాంగ్రెస్.. కేంద్రం మౌనం


2

# ఏడాదిలో పెట్టుబడుల లక్ష్యం

# రూ.10 లక్షల కోట్లు

సీఎస్ విజయానంద్ పాల్గొన్నారు.

**అనుమతులపై సీఎంవో నుంచే పర్యవేక్షణ**

దేశంలోనే మొదటి హైడ్రోజన్ వ్యాలీని రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నామని సీఎం తెలిపారు. 'రాష్ట్రానికి వచ్చే పెట్టుబడుల ప్రతిపాదనలను సీఎంవో నేరుగా పర్యవేక్షిస్తుంది. రాష్ట్రంలో పోర్టులు, ఎయిర్ పోర్టులు, మౌలిక సదుపాయాలు ఉన్నాయి. నీటి వనరులు, వ్యవసాయ రంగంలో ఏపీ అగ్రస్థానంలో ఉంది. డిజిటల్ టెక్నాలజీ, మానవ వనరుల పరంగానూ బలంగా ఉంది. ఆతిథ్య రంగం, ఆయిల్ అండ్ గ్యాస్, పెట్రో కెమికల్స్ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయి. పాలసీ నిబంధనలకు అనుగుణంగా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలను చెల్లిస్తాం. గూగుల్ సంస్థ త్వరలో విశాఖలో అతిపెద్ద డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయబోతోంది' అని వివరించారు.

**లులు వెళ్లి.. వెనక్కి వచ్చింది!**

లులు సంస్థ అంతర్జాతీయ స్థాయి షాపింగ్ మాళ్లను విశాఖ, విజయవాడల్లో ఏర్పాటు చేస్తోందని సీఎం తెలిపారు. అమరావతిలోనూ త్వరలో ఏర్పాటు చేయాలని కోరామన్నారు. 'గత ప్రభుత్వ హయాంలో వివిధ కారణాల వల్ల లులు రాష్ట్రం నుంచి తప్పుకొంది. కూటమి అధికారంలోకి వచ్చాక తిరిగి పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. విశ్వసనీయతకు ఇదొక నిదర్శనం' అని పేర్కొన్నారు.

**ఆరు నెలల్లోనే యూఏఈ సదస్సు**

ఈ ఏడాది జనవరిలో దావోస్‌లో జరిగిన ప్రపంచ దేశాల ఆర్థిక సదస్సులో యూఏఈ ఆర్థిక మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మారిని కలిసి ఏపీకి ఆహ్వానించినట్లు సీఎం చెప్పారు. అప్పుడు ఇచ్చిన హామీ మేరకు యూఏఈ మొదటగా ఏపీలో ఇన్వెస్టోపియా సదస్సు నిర్వహించిందన్నారు. 'యూఏఈ నుంచి 50 బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఆశిస్తున్నామని యూఏఈ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశాల్లో ప్రస్తావిస్తే.. అంతకు మించే వస్తాయని వారు హామీ ఇచ్చారు. పెట్టుబడులు పెట్టేందుకు వివిధ దేశాల్లో జరిపే పర్యటనల సమయంలో 25 శాతాన్ని ఏపీకి కేటాయించాలి' అని సీఎం కోరారు. ఇన్వెస్టోపియా గ్లోబల్ సదస్సుకు హాజరైన పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**దుబాయ్ ఇంటర్నెట్ సిటీ ఒక స్వర్గధామం**

'దుబాయ్‌ని చూస్తే నాకు అసూయ కలుగుతుంది. 50 డిగ్రీల ఉష్ణోగ్రతల ప్రతికూలతల మధ్య దుబాయ్ ఇంటర్నెట్ సిటీ నిర్మాణాన్ని చేపట్టారు.. దాన్ని ఒక స్వర్గధామంలా అక్కడి పాలకులు తీర్చిదిద్దారు. ప్రతి రంగంలోనూ అత్యుత్తమ నగరంగా దుబాయ్ ఇంటర్నెట్ సిటీ ఉంది. అక్కడ ఇంటర్నెట్ సిటీ మొదలు పెడితే.. నేను హైదరాబాద్‌లో హైటెక్ సిటీ నిర్మాణాన్ని ప్రారంభించా. యూఏఈ దార్శనికత.. విధానాల అమలు బాగున్నాయి' అని సీఎం పేర్కొన్నారు. అమరావతి నుంచి హజ్ యాత్రకు మక్కా వెళ్లే వారి కోసం కొత్త విమాన సర్వీసును త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు.

**సాంకేతిక నగరంగా అమరావతి**

అమెరికాలో సిలికాన్ వ్యాలీ తరహాలో.. ఏపీలో క్వాంటమ్ వ్యాలీని వచ్చే ఏడాది జనవరిలో ప్రారంభిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. 'గతంలో సైబరాబాద్ నగరాన్ని నిర్మించే అవకాశం దక్కింది. ఇప్పుడు అమరావతిని నిర్మించే అవకాశం వచ్చింది. యూఏఈ మాదిరిగా పాలనలో సాంకేతికతను వినియోగిస్తున్నాం. ఆధార్, జియోట్యాగింగ్ ద్వారా అన్ని సేవలూ అందిస్తున్నాం. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 550 రకాల ప్రభుత్వ సేవలను ఆన్‌లైన్‌లో అందిస్తున్నాం. ఆగస్టు 15 నాటికి ప్రభుత్వ సేవల కోసం ప్రజలు కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయి' అని వెల్లడించారు.

**ఆలోచనలు వినూత్నంగా ఉండాలి**

'2021లో మనం కొవిడ్‌కు భయపడ్డాం. యూఏఈ విభిన్నంగా ఆలోచించింది. ఆ సమయంలో ఇన్వెస్టోపియాను తెరపైకి తీసుకొచ్చి.. పెట్టుబడులపై దృష్టి పెట్టామని మంత్రి చెప్పిన మాటలు నన్ను ఆకర్షించాయి. చేసే పనులు భిన్నమైనవిగా ఉంటే.. అద్భుతమైన

## మొదటి పేజీ తరువాయి

ఫలితాలు వస్తాయి. ప్రతి రోజూ ఒక విభిన్నమైన ఆలోచన చేస్తే అత్యున్నత ఫలితాలు వస్తాయనడానికి ఇదొక నిదర్శనం. యూఏఈ-భారత్ మధ్య బలమైన వాణిజ్య బంధం ఉంది. యూఏఈ-భారత్ మధ్య 2024-25లో 100 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరిగితే.. అందులో ఏపీ నుంచి 1.5 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరిగింది. భారత్‌లో యువత సంఖ్య ఎక్కువగా ఉండటం సానుకూల పరిణామం' అని సీఎం పేర్కొన్నారు.

# మద్యం కుంభకోణం.. ప్రజలకు జగన్ సూటిగా సమాధానం చెప్పాలి: షర్మిల

మందికి కిడ్నీ సమస్యలు వచ్చాయి. 30వేల మందికి పైగా చనిపోయారు.

సిట్, సీఎం చంద్రబాబు ఈ అంశాలపై దృష్టి పెట్టాలి. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ ఎంత అమ్మారో తేల్చాలి. డిజిటల్ పేమెంట్ ఆపడం వెనుకే అవినీతి ఉంది. జగన్ కూడా వీటికి సమాధానం చెప్పాలి. అసెంబ్లీ సమావేశాలకు వెళ్లి కేవలం క్యాష్ విధానం ద్వారానే మద్యం అమ్మకాలు ఎందుకు చేశారో ప్రజలకు తెలపాలి. ఆయన తనకు అనుకూలంగా ఉన్న అంశాలనే తరచూ చెబుతున్నారు. రుషికొండను ఎందుకు తవ్వారో ఇంతవరకు సమాధానం చెప్పలేదు. వివేకా హత్య కేసులో సాక్షి ఛానల్ తొలుత హార్ట్ ఎటాక్ అని ఎందుకు ప్రసారం చేసిందో తెలియదు. అసలు అంశాలను మరుగున పెట్టి ప్రజల్ని మభ్యపెట్టడంలో జగన్ దిట్ట" అని షర్మిల వ్యాఖ్యానించారు.

# శాంతికి ప్రత్యామ్నాయం లేదు.. కాల్పుల విరమణ జరగాల్సిందే: భారత్

హక్కుల ప్రకారం... 6,50,000 మందికి పైగా పిల్లలు చాలా నెలల నుంచి పాఠశాల విద్యకు దూరంగా ఉన్నారని తెలిపిందన్నారు. పాలస్తీనియన్ల ఆశలను పునరుద్ధరించే, మధ్యప్రాచ్యంలో శాంతి నెలకొల్పేందుకు చేసే అన్ని ప్రయత్నాలకు భారత్ సంసిద్ధత వ్యక్తంచేస్తుందని ఈసందర్భంగా హరీశ్ పేర్కొన్నారు.

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో ఇప్పటివరకు 59వేల పాలస్తీనియన్ల ప్రాణాలు కోల్పోయినట్లు గాజా ఆరోగ్యశాఖ వెల్లడించింది. మానవతా సహాయ కేంద్రాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో అనేక మంది మరణించారని తెలిపింది. వీరిలో ఎక్కువమంది సాయం కోసం ఎదురుచూస్తున్నవారేనని ఐరాస మానవ హక్కుల విభాగం వెల్లడించింది. కాగా.. ఆహారం లేమి కారణంగా పోషకాహార సమస్యతో ఆసుపత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతున్నట్లు పలు నివేదికలు వెల్లడించాయి. శిశువులకు పట్టేందుకు పాలు లేక బాలింతలు ఇబ్బందిపడుతున్న పరిస్థితులు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు.

# భారతీయులను నియమించుకోవద్దు.. టెక్ సంస్థలకు ట్రంప్ వార్నింగ్

"మన దేశంలోని భారీ టెక్ సంస్థలు చైనాలో కంపెనీలు నిర్మిస్తూ.. భారతీయ ఉద్యోగులను నియమించుకొంటూ.. ఐర్లాండ్‌ను అడ్డంపెట్టుకుని తక్కువ లాభాలు చూపుతూ స్వేచ్ఛను అనుభవించాయి. ఆ విషయం మీకు తెలుసు. అమెరికన్ల అవకాశాలను పట్టించుకోకపోవడం, నిర్లక్ష్యం చేయడం వంటివి జరిగాయి. ట్రంప్ పాలనలో ఆ రోజులు ముగిసిపోతాయి. ఏఐ రేసులో విజయం సాధించాలంటే సిలికాన్ వ్యాలీలో సరికొత్త దేశభక్తి అవసరం. ఇక్కడ ఉన్న టెక్ కంపెనీలు అమెరికా కోసమే. దేశానికే మొదటి ప్రాధాన్యం ఇస్తూ పని చేయాలి. మీరూ అదే చేయాలి. నేను కోరుకునేది కూడా అదే" అని ట్రంప్ అన్నారు.

# ఏపీ ఎలక్ట్రానిక్స్ తయారీ పాలసీకి క్యాబినెట్ ఆమోదం.. వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి

ఏపీ ఎలక్ట్రానిక్స్ తయారీ పాలసీకి మంత్రివర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. దీని ద్వారా పరిశ్రమలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రోత్సాహకాలు లభిస్తాయని తెలిపారు. క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి మీడియాకు వెల్లడించారు. "ఎలక్ట్రానిక్స్ తయారీ పాలసీ ద్వారా యూపీ, గుజరాత్, తమిళనాడు లబ్ధిపొందాయి. ప్రత్యేకమైన పాలసీ లేకపోవడంతో పరిశ్రమలకు ప్రోత్సాహకాలు రాని పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో దాదాపు 150 బిలియన్ డాలర్ల వ్యాపారమే లక్ష్యంగా విధానాన్ని రూపొందించాం. పెట్టుబడులు పెట్టేందుకు ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు ఆసక్తి చూపుతున్నాయి. విశాఖలో ఐటీ సేవల కోసం పలు కంపెనీలు ప్రతిపాదనలు ఇచ్చాయి. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ)కి వచ్చిన ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. విశాఖలో సిఫి సంస్థ రూ.16,466 కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. మధురవాడలో ఆ సంస్థకు 3.6 ఎకరాలు ఇచ్చేందుకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది"అని మంత్రి పార్థసారథి తెలిపారు.

# ధన్‌ఖడ్‌కు వీడ్కోలు పలుకుదామన్న కాంగ్రెస్.. కేంద్రం మౌనం

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూలై 24)

ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈసందర్భంగా ఆయనకు వీడ్కోలు పలకాలని కాంగ్రెస్ కోరగా, కేంద్రం స్పందించలేదని తెలుస్తోంది. గురువారం రాజ్యసభలో ఏడుగురు సభ్యులకు వీడ్కోలు కార్యక్రమం ఉంది. ఈనేపథ్యంలో బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ)లో కాంగ్రెస్ సీనియర్ నేత జై రాం రమేశ్ ధన్‌ఖఢ్‌కు కూడా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించాలని డిమాండ్ చేశారు. అయితే, కేంద్రం దీనిపై స్పందించలేదు. కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జేపీ నడ్డా కూడా ఈ విషయంపై ఏం మాట్లాడలేదని అధికార వర్గాలు తెలిపాయి. కాగా.. జైరాం రమేశ్ డిమాండ్‌కు మిగిలిన ప్రతిపక్ష నేతల నుంచి కూడా ఎలాంటి మద్దతు లభించలేదని వెల్లడించారు. ధన్‌ఖడ్ రాజీనామాపై ప్రతిపక్షాలు అనుమానాలు వ్యక్తంచేస్తున్న నేపథ్యంలో వీడ్కోలు కార్యక్రమంపై కేంద్రం స్పందించకపోవడం మరిన్ని ప్రశ్నలకు తావిస్తోంది. ఇక, సోమవారం ఉప రాష్ట్రపతి ధన్‌ఖఢ్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు అనూహ్యంగా ప్రకటించారు. అనారోగ్య కారణాలతోనే వైదొలుగుతున్నట్లు పేర్కొన్నారు. అయితే, దీనివెనక ఏదో పెద్ద కారణం ఉందని ప్రతిపక్షాలు సందేహం వెలిబుచ్చాయి. అయినా వీటిపై కేంద్రం ఇప్పటివరకు స్పందించలేదు. ధన్‌ఖఢ్ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారమే ఆమోదించారు. కేంద్ర హోంశాఖ కూడా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. నూతన ఉప రాష్ట్రపతి ఎన్నిక కోసం అటు ఎన్నికల సంఘం కూడా ఏర్పాట్లు ప్రారంభించింది.

# ఆ ఒప్పందం భారీ విజయం మోదీ పర్యటన వేళ బ్రిటన్ ప్రధాని వ్యాఖ్యలు

**అది ఎంతగానో హత్తుకుంది: మోదీ**

నాలుగు రోజుల పర్యటనలో భాగంగా మోదీ బ్రిటన్, మాల్దీవుల్లో పర్యటిస్తున్నారు. ఈక్రమంలోనే బుధవారం రాత్రి లండన్‌కు చేరుకున్నారు. బ్రిటన్ రాజు ఛార్లెస్-3ని కూడా కలవనున్నారు. ఇక లండన్‌లో దిగిన ప్రధానికి ప్రవాస భారతీయుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. స్వదేశం పురోగతిపై వారు చూపుతోన్న నిబద్ధత తనను ఎంతగానో హత్తుకుందని ఆయన వారిని ఉద్దేశించి సంతోషం వ్యక్తంచేశారు.

# మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దృష్టి సారించాలి

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 24)

గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు సజావుగా చేపట్టి మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, మునిసిపల్ కమీషనర్లను, పంచాయతీ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధ్యక్షతన సీజనల్ వ్యాధుల నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు సజావుగా చేపట్టి మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మునిసిపల్ కమీషనర్లు, పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైనందున అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు పటిష్టంగా అమలు చేస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ, మెదడువాపు మొదల్కైన వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలన్నారు. మలేరియా కేసులు గుర్తించే ప్రక్రియను మెరుగుపరచాలన్నారు. రాపిడ్ టెస్టులలో పాజిటివ్ వస్తే కన్ఫర్మేషన్ టెస్టులు తప్పకుండా చేయాలన్నారు. అన్ని ల్యాబ్‌లలో రిజిష్టర్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. నీటి గుంటల్లో నీరు నిల్వలేకుండా చూడాలని, నీటిగుంటల్లో దోమల లార్వాలు వృద్ధి చెందకుండా గంబూషియా, గుప్పి చేపలను వదిలిపెట్టాలన్నారు. అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రపరచాలన్నారు. కళాశాలలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జనావాసాలు పరిశుభ్రంగా ఉండేలా ఎప్పటికప్పుడు వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేయాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి సీజనల్ వ్యాధులు ప్రబలుకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. వెక్టర్ నియంత్రణ మరియు పరిశుభ్రత యాప్ నిర్వహణ కచ్చితంగా అమలుచేస్తూ ఏఎన్ఎం లు మరియు శానిటరీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. జిల్లాలో లోతట్టు ప్రాంతాలు, ఖాళీ ప్రదేశాల్లో ఎక్కడా కూడా నీరు నిల్వఉండకుండా దోమలు వృద్ధి చెందకుండా ఎక్కడికక్కడ గట్టి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న స్థలాల్లో నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందే అవకాశం ఉన్నందున ఆ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసి నీరు నిల్వ ఉండకుండా గుంతలు లేకుండా బాగు చేసుకోవాలని సూచించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మురికి కాలువలు సజావుగా శుభ్రం చేసేందుకు, అన్ని వసతిగృహాల్లోను క్రమంతప్పక దోమల నివారణ మందులను వినియోగించాలని, మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు క్రమం తప్పక పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మంచి నీటి పైప్ లైన్లు ఎక్కడా కూడా దెబ్బతినకుండా చూసుకోవాలని తద్వారా తాగునీరు కలుషితం కాకుండా గమనించాలన్నారు. ఈ సందర్భంగా శాఖలవారీగా చేపట్టాల్సిన కార్యక్రమాల కార్యాచరణను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. తొలుత జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా వెంకటేశ్వర రావు, జిల్లా మలేరియా అధికారి దోమల నివారణకు క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా మలేరియా నిర్మూలన అధికారి డాక్టర్ మధుసూదనరావు, జడ్పీ సిఇవో చిరంజీవి, ఒంగోలు మునిసిపల్ కమీషనర్ వెంకటేశ్వరరావు, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ బాల శంకరరావు, ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి, జిల్లా విద్యా శాఖాధికారి కిరణ్ కుమార్, ఐసిడిఎస్ పీడీ సువర్ణ, డిఆర్డిఎ పీడీ నారాయణ, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, బీసీ వెల్ఫేర్ అధికారి నిర్మల జ్యోతి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి వరలక్ష్మి, మైన్స్ డి డి రాజశేఖర్, జిల్లాలోని అన్ని మున్సిపాల్టీల కమీషనర్లు, తదితరులు పాల్గొన్నారు.





# బిఎస్ఎమ్ జడ్పీ హై స్కూల్లో నోట్‌బుక్స్ పంపిణీ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 24)





కొత్తపట్నం గ్రామంలోని బిఎస్ఎమ్ జడ్పీ హై స్కూల్ లో గురువారం నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం వైభవంగా జరిగింది. శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చాపలవంశీకృష్ణ మాట్లాడుతూ కొత్తపట్నం , ఒంగోలు మండలం లోని ఎంపిక చేసిన గవర్నమెంట్ స్కూల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్నామని తెలియజేశారు. ఈ పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొత్తపట్నం మండలం విద్యాశాఖ అధికారి -1 మరియు విద్యాశాఖ అధికారి - 2 పాల్గొన్నారు. కొత్తపట్నం మండలం విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ డాక్టర్ చాపల వంశీకృష్ణ గారు వైద్యరంగంతో పాటు విద్యారంగం అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారని, ఎంతోమంది ఉపాధ్యాయుల సేవలను గుర్తించి వారిని ఘనంగా సత్కరించుకుంటున్నారని తెలియజేశారు. తనలాగే తన ఊరు పిల్లల కూడా బాగా చదువుకొని, అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్ష తొ వారికి ఉచిత పుస్తకాలు, ఉచిత బస్సు పాసులు కల్పించడం, అలాగే విద్యార్థుల తో పాటు వారి కుటుంబ సభ్యులకు శ్రీరామ్ ఆరోగ్య రక్ష కార్డులను ఇచ్చి ఉచితంగా వైద్యం అందజేస్తున్నారు. శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ , ప్రముఖ ఎముకలు మరియు కీళ్ల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చాపల వంశీకృష్ణ మాట్లాడుతూ చదువు మనలో ఆత్మవిశ్వాసం పెంచుతుందని, మనిషిని అజ్ఞానంలో నుండి జ్ఞానం మార్గంలోకి నడిపించే ఏకైక సాధనం చదువు అని తెలియజేశారు. చదువు ఒక మనిషిని కాదు ఒక కుటుంబాన్ని, ఒక సమాజాన్ని ఒక దేశాన్ని మార్చగల శక్తి కలది అని అన్నారు. తాను కొత్తపట్నం నుండి మొట్టమొదటి డాక్టర్ అని, తనలాగే వాళ్ల ఊరి నుండి విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆ కోరిక మేరకు ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించి , వారికి కెరీర్ గైడెన్స్ అందజేస్తున్నామని తెలియజేశారు. తమ కుటుంబం ఎన్నో సంవత్సరాలుగా విద్యా వ్యాప్తికి కృషి చేస్తుందని పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాల పంపిణీ, బస్సు పాసులు పంపిణీ, మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించడం చేస్తున్నామని, మెరుగైన విద్యను అభ్యసించడానికి సహాయ సహకారాలు అందజేస్తున్నామని తెలియజేశారు. గత విద్యాసంవత్సరంలో మెరిసిన టాపర్ విద్యార్థుల ఫోటోలు, ఉత్తమ ఉపాధ్యాయులు, గ్రామంలోని మొదటి తరం విద్యావంతులు, గ్రామాభివృద్ధికి కృషి చేసిన వారి ఫోటోలు నోట్‌బుక్స్ పై ముద్రించబడి, రాబోయే తరాల విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తున్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ప్రసూతి మరియు స్త్రీ వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ చాపల శాంతకుమారి, హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాసరావు , ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

షణ్ముఖ వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు | తెలుగు దినపత్రిక

ప్రకాశం




# పేదరికం లేని సమాజాన్ని రూపొందించడంలో కాంట్రాక్టర్లు కలిసి రావాలి

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 24) పేదరికం లేని సమాజాన్ని రూపొందించటంలో కాంట్రాక్టర్లు కూడా కలిసి రావాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. ఇందుకోసం పీ4 పథకంలో ' మార్గదర్శకులు ' గా నిలవాలని కోరారు. రహదారులు – భవనాలు, ఆర్డబ్ల్యూఎస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో పనులు చేపట్టే కాంట్రాక్టర్లతో గురువారం ప్రకాశం భవనంలో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న పీ4 పథకం గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్

4

# శ్రమ, ప్రకృతి, స్త్రీ, మానవ సంబంధాలే

## నా కవితా స్ఫూర్తి

## సినీ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ

## నెల నెలా నందివర్ధనం సాహితీ సభలో సుదీర్ఘ ఉపన్యాసం




(షణ్ముఖ వెలుగు, చీరాల, జులై 24) సినీ సాహిత్యంలోనైనా సామాజిక విప్లవ సాహిత్యంలోనైనా శ్రమ, ప్రకృతి, స్త్రీ, మానవ సంబంధాలే నా కవిత స్ఫూర్తి అని సినీ రచయిత సుద్దాల అశోక్ తేజ పేర్కొన్నారు. ఔచిత్యం పాటించే కవిత్వం ఏదైనా ప్రేక్షకులను పాఠకులను రంజింప చేస్తుందని ప్రముఖ సాహితీవేత్త సినీ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ అన్నారు. గురువారం సాయంత్రం బాపట్ల జిల్లా చీరాల మండలం తులసి నగరంలో వివేకా సర్వీసు సొసైటీ, ధృతి సాహిత్య సాంస్కృతిక సామాజిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన నెల నెల నందివర్ధనం నూట మూడవ సాహితీ సభలో ఆయన పాల్గొన్నారు. నా కవిత్వ తత్వం, నిర్మాణం, గమనం, గమ్యం అను అంశంపై సుద్దాల అశోక్ తేజ సుదీర్ఘంగా ప్రసంగించిన తీరు సభికులను మంత్రముగ్ధులను చేసింది. పాట, సంగీతం, సాహిత్యం తన కుటుంబం నుంచి వారసత్వంగా తనకు సంక్రమించాయని తండ్రి హనుమంతు నుంచి ఎన్నో మెళకువలు నేర్చుకోవడం జరిగిందన్నారు. ఎలాంటి సాహిత్యానికైనా, ఎంతటి మహా తత్వానికైనా, గొప్ప కవిత్వానికైనా ఔచిత్యభంగం కలగకూడదని తాను విశ్వసిస్తానన్నారు. కవిత్వానికి పునాదిగా ఔచిత్యాన్ని క్రమం తప్పకుండా పాటించడం అనేది తనకు అలవాటు అయి, అదే పరిపాటిగా మారిందని స్పష్టం చేశారు. తన సాహిత్యం యావత్తూ ప్రకృతి ... శ్రమ ... స్త్రీ ... మానవ సంబంధాలు అనే అంశాల మీద కొనసాగిందన్నారు. ఎంతో విస్తృతంగా చర్చను కొనసాగిస్తూ, ప్రజలను చైతన్యం చేసే విధంగా ఈ నాలుగు అంశాల మీద తన సాహిత్యం మనుగడ సాగించిందన్నారు. సాహిత్యం ప్రజల చెవిని, హృదయాన్ని రెండింటినీ తాకే విధంగా మంచి ఎత్తుగడతో ముందుకు సాగాలని తన తండ్రి ఇచ్చిన మార్గదర్శకత్వంలో తన కవిత్వ ప్రస్థానం కొనసాగిందన్నారు. నేలమ్మ నేలమ్మ నేలమ్మా నీకు వేల వేల వందనాలమ్మ.. అంటూ ప్రకృతికి కృతజ్ఞతలు తెలిపే కవిత్వం, ప్రతి స్త్రీలో అమ్మను, సోదరిని చూడాలనే సందేశంతో స్త్రీ ఔన్నత్యాన్ని తెలియజేసే కవిత్వం, శ్రమ శక్తి గొప్పతనాన్ని తెలియజేసే కవిత్వం, మానవ జీవన సౌందర్యాన్ని , మానవ సంబంధాల (తరువాయి 4లో...)

# మీకు మార్గదర్శిగా ఉంటా....



## మీ పిల్లలను చదివించే బాధ్యత నాది

## జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జులై 24)
మీకు మార్గదర్శిగా ఉంటా, మీ పిల్లలను బాగా చదివించే బాధ్యత నాది... ఒక ఇంజనీర్, డాక్టర్, రాజకీయ నాయకుడుని చేయాలనే లక్ష్యంతో ఈ పది కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ప్రకటించారు. పి4 విధానంలో చెరుకుపల్లి మండలం తూర్పుపాలెం, బలుసులపాలెం, కుంబాలవారిపాలెం, ఆరంబాక గ్రామాలలోని అత్యంత నిరుపేదలైన పది గిరిజన యానాది బంగారు కుటుంబాలను కలెక్టర్ దత్తత తీసుకున్నారు. పి4 బంగారు కుటుంబాలతో చెరుకుపల్లిలోని ఎండిఓ కార్యాలయం వద్ద గురువారం గ్రామ సభ నిర్వహించారు. వారి కుటుంబ జీవనం, ఆర్థిక స్థితిగతులపై స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఎలుకలు పట్టడం, పాచి పని, పొలాలలో ఎరువులు చల్లడం వంటి చిన్న చిన్న పనులతో కుటుంబానికి నెలకు కనీసం రూ.10 వేలు కూడా ఆదాయం రావడం లేదని బంగారు కుటుంబాల వారు కష్టాలను చెప్పుకోవడంతో కలెక్టర్ చలించిపోయారు. ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు జారీ చేస్తామన్నారు. ఆ కుటుంబాలకు బ్యాంకు ఖాతాలు లేకపోవడంతో తక్షణమే బ్యాంకు ఖాతాలు ఇప్పిస్తామన్నారు. వారి జీవనశైలని తెలుసుకున్న కలెక్టర్ ఒక్కొక్క కుటుంబానికి రూ.50 వేల నుంచి రూ.65 వేల వరకు ఆర్థిక సహాయం చేస్తామన్నారు. ఆరు కుటుంబాలకు ఇల్లు మంజూరు, మిగిలిన వారికి ఇంటి స్థలం, ముగ్గురికి ఆటోలు, లైసెన్సులు, ఒకరికి బడ్డీకొట్టు, మిగిలిన వారికి ఉపాధి హామీ పథకం కింద పని కల్పిస్తామన్నారు. ఇద్దరు ఆడపిల్లలు ఉన్న పోలమ్మ కుటుంబానికి వాత్సల్య పథకం వర్తింప చేస్తామన్నారు. ఉప్పు దుర్గ కుమార్తెకు సైకిల్, ఏడుకొండలు కుటుంబానికి మెడికల్ పింఛన్ కొరకు వైద్య పరీక్షలు (తరువాయి 4లో...)




# ప్రభుత్వ సేవల పట్ల ప్రజల సంతృప్తి స్థాయి పెంచేలా శ్రద్ధ తీసుకోవాలి

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 24)
ప్రభుత్వ సేవల పట్ల ప్రజల సంతృప్తి స్థాయి పెంచేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యకాదర్శి కె విజయానంద్ పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయం నుండి ప్రభుత్వ సేవల పట్ల ప్రజల సంతృప్తి స్థాయి, పీ4 కార్యక్రమం అమలు, డాక్యుమెంట్స్ అప్ లోడ్, ప్రాజెక్ట్స్ భూ సేకరణ తదితర అంశాల పై వివిధ శాఖల రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లతో గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎస్ సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎస్ విజయానంద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఇసుక పంపిణీ, పేదలకు గృహ నిర్మాణం, విద్యుత్ సరఫరా, తదితర సేవలలో ప్రజలు తెలియజేసిన సమస్యలను వెంటనే పరిష్కరించి ఆయా సేవల పట్ల ప్రజలు సంతృప్తి స్థాయిని మరింత పెంచేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. విద్యుత్ పంపిణీలో లో ఓల్టేజ్ వంటి ఎటువంటి సమస్యలు లేకుండా నాణ్యమైన విద్యుత్ పంపిణీకి చర్యలు తీసుకోవాలని, ఉచిత ఇసుక పంపిణీ విధానంలో ప్రజలు ఇబ్బంది కలగని రీతిలో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పేదల గృహ నిర్మాణంలో వారి సమస్యలు తెలుసుకుని, నిర్మాణ సామాగ్రి, సాంకేతిక సహకారం అందించేలా గృహ నిర్మాణ శాఖ అధికారులు చూడాలన్నారు. ఆగష్టు, 15 వ తేదీ లోపు రాష్ట్రంలో (తరువాయి 4లో...)



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జులై 24) సమాజంలో అత్యంత నిరుపేదలుగా ఉన్న బంగారు కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి చేయూతనందిస్తామని కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతమైన ఆలోచనలతో పి4 విధానాన్ని ప్రవేశపెట్టారన్నారు. సమాజంలో ఆర్థికంగా అత్యంత వెనుకబడిన వారు, అట్టడుగున ఉన్న నిరుపేద కుటుంబాలను ఎంపిక చేసామన్నారు.

4

# బంగారు కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి చేయూతనందిస్తాం

## జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి



## భూసేకరణలో రాష్ట్ర ప్రభుత్వం భారీ కుట్ర
### రైతు ఉద్యమ నాయకుడు మిరియం శ్రీనివాసులు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 24)

సముద్ర తీర ప్రాంతంలో ఉన్న గ్రామాల మొత్తాన్ని భారీ పరిశ్రమలకు భూసేకరణ చేయాలని అటువంటి ఆలోచనతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం భారీ కుట్ర పన్నుతోందని కరేడు రైతు ఉద్యమ నాయకుడు మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటన తెలిపారు. సముద్ర తీర ప్రాంతంలో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కొన్ని వందల కిలోమీటర్ల పరిధిలో పరిశ్రమల కొరకు భూసేకరణ చేయాలని దుర్మార్గమైనటువంటి ఆలోచనతో ఉండదని ప్రజలందరూ గమనించి కరేడు రైతుల ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని లేని పక్షంలో భవిష్యత్తులో కొన్ని వందల గ్రామాలు భూసేకరణ వల్ల నష్టపోవాల్సి వస్తుందని, ముందుగా కల మేల్కొని ఉద్యమాలలో పాల్గొనాలని కోరారు త్వరలో కృష్ణపట్నం నుంచి బందరు దాకా రైతులతో సమావేశమై భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ ప్రకటించుకోవాల్సిన అవసరం ఏర్పడిందని ప్రభుత్వం మొండిగా ఒక్కొక్క గ్రామాన్ని టార్గెట్ చేస్తూ భూసేకరణ చేయటం దానిలో నాగమణి శ్రీనివాసులు తెలిపారు. మొదటిగా కరేడులో భూసేకరణకు వ్యతిరేకంగా విజయం సాధించగలిగితే మిగతా గ్రామాలకు ఎలాంటి ప్రమాదం ఉండబోదని అలా కాని పక్షంలో కృష్ణపట్నం నుండి బందరు వరకు రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని శ్రీనివాసులు తెలిపారు.

## కరేడు పోరాటానికి సంఘీభావంగా సిఐటియు కరపత్ర ప్రచారం



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 24)

ఉలవపాడులో సిపిఎం కార్మిక శాఖా సమావేశం గురువారం కామ్రేడ్ ఎస్‌డి జహీర్ అధ్యక్షతనలో జరిగింది. ఈ శాఖ సమావేశంలో సిపిఎం గుడ్లూరు, ఉలవపాడు ప్రాంతీయ కమిటీల కార్యదర్శులు జివిబి కుమార్‌లు పాల్గొని మాట్లాడారు. కరేడులో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బలవంతపు సేకరణకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమంలో ఆటో, అంగన్వాడి, ఇతర కార్మికుల తరఫున పాల్గొనాలని, వారి పోరాడటానికి అండగా ఉంటామని, ఇంటింటికి కరపత్రాలు పంచి రైతులు,కూలీలు, కార్మికులను చైతన్యం చేయాలని శాఖ సమావేశం నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న బలవంతపు భూసేకరణ నుండి ప్రభుత్వం వెనక్కి పోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శాఖా కార్యదర్శి ఎస్. డి గౌస్ బాషా, శాఖ సభ్యులు సిహెచ్ ఇందిరావతి, కే తిరుపతమ్మ, వై కోటేశ్వరమ్మ, ఏ గీత, జే ప్రవీణ, ఎస్.కె మీరాసా, తదితరులు పాల్గొన్నారు.

## కంపుకొడుతున్న కందులాపురం రోడ్డు
### మారని పంచాయతీ అధికారుల తీరు





(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 24)

కంభం మండలం కందులాపురం పంచాయతీ అధికారుల తీరు రోజురోజుకి దిగజారుతున్నది. అసలే వర్షాకాలంతో సీజనల్ వ్యాధులు ప్రభలుతున్నా మేమింతే అంటున్న పంచాయతీ సిబ్బంది. ఊరిలో చెత్తను తీసివేయకుండా అక్కడక్కడా ఉన్న చెత్తను తెచ్చి ఇళ్లమధ్యన వేస్తున్న తీరు చూసి స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ఎన్నోసార్లు సంభంధిత అధికారులకు ఇళ్ళముందు ఉన్న చెత్తను తొలగించమని వేడుకుంటే లేని చెత్తను తెచ్చి ఇళ్ల మధ్యన వేస్తున్నారు. దీనితో పందుల సంచారం ఎక్కువ అయిందని కుళ్ళిపోయిన వాసనతో కంపులో జీవిస్తున్నామని దోమలు విపరీతంగా పెరిగిపోయి విషజ్వరాలు, సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నాని ఇక్కడే కాకుండా అరఫత్ నగర్ రోడ్డు మార్గంలో అరకిలోమీటర్ పరిధిలో మూడు చోట్ల ఇలా ఇష్టం వచ్చినట్లు ఎక్కడో చెత్తను తెచ్చి ఇక్కడ పోసి ఎప్పుడోగాని మళ్ళీ తీసుకొని వెళ్ళరని జననివాసం ఉంటున్న చోట ఇలాచేయడం ఎంతవరకు సమంజసమో అధికారులకే తెలియాలని ఇప్పటికైనా స్థానిక ప్రజలపట్ల ఏమాత్రం జాలి దయ వున్నా దయచేసి మాగోడు విని కంపుగొడుతున్న ఈ దంపింగులను తీసివేసి పందుల బెడద నుండి, కుక్కల బెడదనుండి,దోమల బెడదనుండి కాపాడాలని స్థానిక ప్రజలు సంభంధిత అధికారులను కోరుతున్నారు.

# పేదరికం లేని సమాజాన్ని రూపొందించడంలో కాంట్రాక్టర్లు కలిసి రావాలి

ద్వారా ఈ ప్రతినిధులకు జడ్పీ సీఈవో చిరంజీవి ఈ సందర్భంగా వివరించారు. అనంతరం సమాజంలో అభివృద్ధిపరంగా పై స్థాయిలో ఉన్న 10 శాతం ప్రజలు, కింది స్థాయిలో పేదరికంతో బాధపడుతున్న 20% కుటుంబాలకు పలు రకాలుగా చేయూతనిచ్చి పేదరికాన్ని ఆయా కుటుంబాలు అధిగమించేలా చూడడమే ఈ పథకం ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. ఈ దిశగా చేయూత అవసరమైన కుటుంబాలు మన జిల్లాలో 74 వేలకు పైగా ఉన్నట్లు గుర్తించామన్నారు. వీటిని ' బంగారు కుటుంబాలు'గా పేర్కొంటున్నట్లు చెప్పారు. ఆయా కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలిచే వారిని ' మార్గదర్శకులు ' అని పేర్కొంటున్నట్లు తెలిపారు. మార్గదర్శకులు ఆర్థిక సహాయమే చేయాలన్నది ఈ పథకం ఉద్దేశం కాదని, బంగారు కుటుంబాలు పేదరికాన్ని అధిగమించేలా వివిధ రకాలుగా ' మార్గదర్శకం ' చేయాల్సి ఉంటుందన్నారు. ఆయా అవసరాలను, కుటుంబాలను సచివాలయ సిబ్బంది ద్వారా ఇప్పటికే గుర్తించామన్నారు. ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌సైట్‌లో ఈ వివరాలను పొందుపరిచినట్లు చెప్పారు. ఈ జాబితాను అందజేస్తామని, పరిశీలించి అవసరమైన, చేయగల సహాయం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ జాబితాలో లేని కుటుంబాలకు కూడా



సహాయం అవసరం అని గుర్తించి తమకు తెలియజేస్తే వాటిని కూడా ఇందులో చేర్చుతామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు అదనంగా ఇతర సహాయం ఏమైనా బంగారు కుటుంబాలకు అవసరమని గుర్తిస్తే, ఆ దిశగా సహాయం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. స్వచ్ఛందంగా మార్గదర్శకులుగా ముందుకు రావాలని, శక్తి మేరకు ఎన్ని కుటుంబాలనైనా దత్తత తీసుకునే వెసులుబాటు ఉందని కలెక్టర్ తెలిపారు. పేద కుటుంబాల్లోని పిల్లలను చదివించడం, ఆయా కుటుంబాలకు అవసరమైన జీవనోపాధి కల్పనకు శక్తి మేరకు కృషి చేయటం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నావారికి వైద్యం కోసం చేయూతనివ్వటం, అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వం నుంచి లభించాల్సిన సంక్షేమ పథకాల ప్రయోజనం ఆయా కుటుంబాలకు దక్కనప్పుడు ఈ విషయాన్ని అధికారులు దృష్టికి తీసుకెళ్లి లబ్ది కలిగేలా చూడటం వంటి సహాయం చేయవచ్చని చెప్పారు. బంగారు కుటుంబాలకు ఉన్న ఆర్థికేతర అవసరాలపై అవగాహన కల్పించవచ్చన్నారు. స్వర్ణాంధ్ర - 2047 కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన విజన్ యాక్షన్ ప్లానులో పది సూత్రాలను రూపొందించారని కలెక్టర్ తెలిపారు. పేదరిక నిర్మూలన ఇందులో ఒకటి అని చెప్పారు. పీ - 4 కార్యక్రమం ద్వారా పేదరికం లేని సమాజాన్ని రూపొందించాలనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి ఆలోచనలు, ఆశయ సాధనకు అనుగుణంగా సహాయం చేసే శక్తి ఉన్న వారందరూ తమ వంతు బాధ్యత తీసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశాలలో జడ్పీ సీఈవో చిరంజీవి, సీపీవో స్వరూప రాణి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రవికుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ బాల శంకరరావు, ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి, ఆర్ అండ్ బి ఎస్ఈ రవి నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# శ్రమ, ప్రకృతి, స్త్రీ, మానవ సంబంధాలే




గొప్పతనాన్ని, ప్రత్యేకతను తెలియజేసే కవిత్వం తన నుంచి ప్రసవించి, ప్రసరించిందన్నారు. ఏదైనా ఒక రచన పాండిత్యాన్ని ప్రదర్శించడం కన్నా , సమస్య పరిష్కారాన్ని జన పదాలతో సమాజానికి అందించడమే రచయిత బాధ్యత కావాలని ఆయన తెలిపారు. సుమారు ఐదు వేలకు పైగా సినీ గీతాలు వ్రాయడం సమాజం నాకిచ్చిన గౌరవంగా భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా "తెలుగు సినీ గేయ సాహిత్యం" అనే శీర్షికతో నెల నెల నందివర్ధనం కార్యక్రమాల ప్రసంగ పాఠాల సంచికను డా. సుద్దాల అశోక్ తేజ ఆవిష్కరించారు. వివేక సర్వీస్ సొసైటీ అధ్యక్షులు ఎన్ వి నాగరాజు, కార్యదర్శి అంబటి మురళీ కృష్ణ, ధృతి అధ్యక్షులు కళ్ళం అన్న హరినాధ రెడ్డి, కార్యదర్శి చాపల సుబ్రహ్మణ్యం, విద్యార్థినీ, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బంగారు కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి చేయూతనందిస్తాం

జిల్లాలో 62 వేల బంగారు కుటుంబాలను గుర్తించగా, నీడ్ బేస్డ్ సర్వే ద్వారా అనర్హులను తొలగించామన్నారు. ప్రస్తుతం 58 వేల బంగారు కుటుంబాలు బాపట్ల జిల్లాలో ఉన్నాయన్నారు. వారికి సహాయం చేయడానికి నాలుగు వేల మంది మార్గదర్శిలు ముందుకు వచ్చారన్నారు. బంగారు కుటుంబాలను ఆగస్టు 15వ తేదీ లోగా వారికి అనుసంధానిస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి తీసుకున్న నిర్ణయం చాలా బాగుందన్నారు. అదే స్ఫూర్తితో చెరుకుపల్లి మండలం మారుమూల ప్రాంతాలలోని అత్యంత నిరుపేదలైన 10 యానాది కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు వివరించారు. ఆ కుటుంబాలకు ఎలాగైనా సహాయం అందించే లక్ష్యంతో ఒక వాట్సాప్ గ్రూపులో ఎల్లప్పుడూ అందు బాటులో ఉంటానన్నారు. జాగా లేని వారికి ఇంటి స్థలం, గూడు లేని వారికి పక్కా గృహం నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే నగదు, నా వంతు సాయంగా కలిపి రూ.నాలుగు లక్షలు ఇస్తామన్నారు. మెరుగైన వైద్యం, ఉపాధి హామీ పథకం కింద పని దినాలు, జోవనోపాధికి యూనిట్లు ఏర్పాటు చేస్తామన్నారు. వారి పిల్లల చదువులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ఆర్డిఓ రామలక్ష్మి, సిపిఓ షాలేమ్ రాజు, డిఆర్‌డిఎ పి డి శ్రీనివాసరావు, స్థానిక తహసిల్దార్, ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మీకు మార్గదర్శిగా ఉంటా....

నిర్వహిస్తామని చెప్పారు. మీ కుటుంబాల అవసరాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి వాట్సాప్ గ్రూపులో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని వారికి భరోసా ఇచ్చారు. మీకు అండగా ఉంటాను. మీ కుటుంబాలలో ఇంజినీర్, డాక్టర్, రాజకీయ నాయకుడు రావాలి, మీ పిల్లలు ఎంతవరకు చదువుకుంటే అంతవరకు మీకు ప్రోత్సాహం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. బంగారు కుటుంబాలకు చేయూతనందించడానికి కలెక్టర్ ముందుకు రావడంపై గ్రామ సభకు హాజరైన అధికారులు, ప్రజలు హర్షధ్వానాలతో అభినందనలు తెలిపారు.

# ప్రభుత్వ సేవల పట్ల ప్రజల సంతృప్తి స్థాయి




15 లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శకులతో అనుసంధానం చేసి, బంగారు కుటుంబాలు అభివృద్ధి దిశగా పయనించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సభలు నిర్వహించి బంగారు కుటుంబాల అభివృద్ధికి అవసరమైన 'నీడ్స్ అసెస్మెంట్ సర్వే' నిర్వహించి, వాటిని మార్గదర్శకులకు తెలియజేసి, బంగారు కుటుంబాలను మార్గదర్శిలతో అనుసందించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ పీ4 కార్యక్రమంలో బంగారు కుటుంబాలు, మార్గదర్శికుల గుర్తింపు అనుసంధానంలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేస్తామని సిఎస్ కు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, జిల్లా రెవిన్యూ అధికారి చిన ఓబులేసు, జిల్లాపరిషత్ సీఈఓ చిరంజీవి, డిఎస్ఓ పద్మశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

# అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి నివాళులు

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 24)

ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ పితామహులు, పద్మశ్రీ స్వర్గీయ అయ్యంకి వెంకట రమణయ్య జయంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా జయంతి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాలకుడు డి. కోటేశ్వరరావు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## లింగాపురం గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహారావు ఆధ్వర్యంలో
# కోట్ల కృష్ణారావు మాస్టర్ కి ఘన సన్మానం

(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జులై 24)

మాచర్ల మండలంలోని లింగాపురం గ్రామంలో ఎనిమిదేళ్ళపాటు అంకితభావంతో ఉపాధ్యాయ సేవలు అందించిన కోట్ల కృష్ణారావు మాస్టర్ ఇటీవల బదిలీ పై వెళ్లిన సందర్భంగా గురువారం గ్రామస్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో గ్రామ పెద్దలు మాట్లాడుతూ కృష్ణారావు ఈ గ్రామంలో విద్యకు కొత్త ఒరవడి తీసుకొచ్చారు. పాఠశాల అభివృద్ధిలో, విద్యార్థుల ప్రగతిలో ఆయన పాత్ర మరువలేనిది అని కొనియాడారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ మా పిల్లలను తన పిల్లల్లా చూసుకొని, చదువుతో పాటు మంచి మానవీయ విలువలు నేర్పిన గురువు కృష్ణారావు అని అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయ మిత్రులు ఆయనతో కలిసి పని చేసిన అనుభవాలను గుర్తు చేసుకుంటూ, అంతటి నిస్వార్థమైన, సహృదయత కలిగిన ఉపాధ్యాయుడు మా బృందానికి తక్కువ కాలక్షేపం కాదు అని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు కృష్ణారావు మాస్టర్ కి గీతాలు, పద్యాలతో, చిన్న ప్రదర్శనలతో కృతజ్ఞతను తెలిపారు. వారి కన్నీటి వీడ్కోలు అందరినీ తడిపేసింది. ఈ కార్యక్రమంలో మాస్టర్ మాట్లాడుతూ లింగాపురం నాకు ఎప్పటికీ గుర్తుగా మిగిలిపోతుంది. ఇక్కడి పిల్లలు, ఇక్కడి ప్రజలు నాకు కుటుంబ సభ్యుల్లా మీరు ఇచ్చిన ప్రేమను జీవితాంతం గుర్తుంచుకుంటాను అని భావోద్వేగంగా స్పందించారు. ఈ కార్యక్రమం అంతా ఒక భావోద్వేగాల సముద్రంలా కొనసాగి, స్మరణీయంగా ముగిసిందనీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, గ్రామ పెద్దలు కృష్ణ రావు మాస్టర్ ని దుశ్యాలువాలతో సత్కరించి, ఘనంగా వీడ్కోలు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ సైదారావు, సుమతి మేడం, విద్య వాలంటీర్ పి సుందర్రావు, గ్రామ సర్పంచి వెంకయ్య, నాగేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహారావు, రేషన్ డీలర్ రమేష్, గాజుల నరసయ్య, ఎస్ అమరయ్య, గొర్రె వీరయ్య, గోగు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.





# మడ అడవుల దినోత్సవాన్ని జయప్రదంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి







(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జులై 24)

మడ అడవుల దినోత్సవాన్ని జయప్రదంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. మడ అడవుల దినోత్సవం నిర్వహణపై మొక్కలు నాటే ప్రాంతాలను జిల్లా కలెక్టర్ గురువారం పరిశీలించారు. సూర్యలంక తీర ప్రాంతం, నగర వనాన్ని ఆయన పరిశీలించారు. మడ అడవుల దినోత్సవానికి బాపట్ల సూర్యలంకకు ఏపీ ఉప ముఖ్యమంత్రి, పంచాయితీశాఖ మంత్రి కె పవన్ కళ్యాణ్ జిల్లాకు రానున్నారని కలెక్టర్ చెప్పారు. మడ అడవులు వృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. అందులో భాగంగా మొక్కలు నాటుతామన్నారు. సూర్యలంకలోని అటవిశాఖ కు చెందిన నగరవనం, సూర్యలంక తీర ప్రాంతంలోని అటవీ భూములను కలెక్టర్ పరిశీలించారు. మడ అడవులు పెరగడం ద్వారా ప్రకృతి విపత్తుల మంచి తీవ్రమైన నష్టం జరగకుండా అరికట్టగలమన్నారు. వాటి ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మంత్రి పర్యటనను జయప్రదం చేయాలని అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఆయన వెంట జిల్లా అటవీ శాఖ అధికారి వినోద్ కుమార్, డిపిఓ ప్రభాకర్ డ్వామా పిడి విజయలక్ష్మి, బాపట్ల ఆర్డీవో గ్లోరియా, తదితరులు పాల్గొన్నారు.

## చెత్త సేకరణ పై స్పెషల్ డ్రైవ్







(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జులై 24)

మండల కేంద్రమైన పొన్నలూరులో గురువారం ఎంపీడీవో పి సుజాత 24 పంచాయతీ కార్యదర్శులకు తడి చెత్త ,పొడిచెత్త స్వీకరణల పై తగు సలహాలు సూచనలు తెలిపారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి తడిచేత్త పొడి చెత్త వ్యర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డ్రంపింగ్ యాడ్ దగ్గర పంచాయతీ కార్యదర్శులకు వర్మీ కంపోస్ట్ సూచనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఈవోఆర్డి సుబ్రహ్మాణ్యం, మండల ప్రజా పరిషత్ ఏవో ఎం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# వళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడండి

**లేకుంటే ప్రజలే బుద్ధి చెబుతారు**
**ప్రతిపక్షాల అసత్య ప్రచారాల పై ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఫైర్**
**ప్రజల కోసం పనిచేస్తుంటే బురద జల్లుతారా?**
**ఏడాదిలో కందుకూరు నియోజకవర్గంలో వేగమైన అభివృద్ధి**
**పారిశ్రామిక ప్రగతి వైపే కూటమి ప్రభుత్వం పయనం**
**ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు**

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 24)

కందుకూరు నియోజకవర్గంలో గడిచిన 40 ఏళ్లతో పోలిస్తే, ఈ ఏడాదిలో అభివృద్ధి వేగంగా జరిగిందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం ఉదయం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చల్లని చూపుతో బిపిసిఎల్, ఇండోసోల్ కంపెనీలు ఏర్పాటు కాబోతున్నాయి. ఉపాధి ఉద్యోగ అవకాశాలు వస్తాయని ప్రజలంతా హ్యాపీగా ఉన్నారు. అది సహించలేని వైసీపీ నేతలు లేనిపోని అసత్య ప్రచారాలతో ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారని తెలిపారు. అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇకనైనా వారి తీరు మార్చుకోవాలి. ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడాలి. లేకుంటే చట్టం తన పని తాను చేసుకుపోతుంది... అంటూ కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. గతంలో పాదయాత్రలో భాగంగా యువ నాయకులు రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ నారా లోకేష్ గారు ఇచ్చిన హామీ మేరకు కందుకూరు నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు కృషి జరుగుతోందన్నారు. ప్రముఖ కంపెనీలైన బిపిసిఎల్, ఇండోసోల్ తో పాటు మరికొన్ని కంపెనీల ఏర్పాటుతో వేల మందికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. నియోజకవర్గం నుంచి దాదాపు 30 వేలమంది వలసలు వెళుతున్నారని, వారందరికీ ఇక్కడే ఉపాధి దొరికేలా పారిశ్రామికంగా అడుగులు వేస్తున్నామని నాగేశ్వరరావు తెలిపారు. కరేడు భూ సేకరణ విషయంలో, రైతుల ఆవేదనను అధికారులతో కలిసి తాను ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి దృష్టికి తీసుకువెళ్లానని నాగేశ్వరరావు గారు చెప్పారు. కేవలం 4,500 ఎకరాలు మాత్రమే సేకరించేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని స్పష్టం చేశారు. కానీ వైసీపీ నేతలు ఆ గ్రామాలలోకి వెళ్లి అబద్దాలను ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. సోషల్ మీడియాలో పదేపదే అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. లింగసముద్రం మండలంలో జెఎస్ డబ్ల్యూ కంపెనీకి వేలాది ఎకరాలు ధారాదత్తం



చేస్తున్నారని ప్రతిపక్షాలు మరో నాటకానికి తెర తీశారని ఇంటూరి నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. 2022లో అప్పటి వైసిపి ప్రభుత్వం హైపవర్ కమిటీని ఏర్పాటు చేసి, కమిటీ నివేదిక ఆధారంగా 2023లో శాంపిల్ తవ్వకాల కోసం జీవో విడుదల చేసిందని తెలిపారు. జెఎస్ డబ్ల్యూ కంపెనీ నుంచి 1.5 కోట్లు డబ్బులు కట్టించుకుని, 11,947 చదరపు మీటర్ల పరిధిలో తవ్వకాలకు అనుమతులు ఇచ్చిందన్నారు. అవన్నీ బయట పెట్టకుండా, తమ ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని వైసీపీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావును ఉద్దేశించి నాగేశ్వరరావు ఘాటుగా మాట్లాడారు. రాజకీయ నాయకుడిగా విలువలు కాపాడుకోవాలి తప్ప, ఇలాంటి నీచ రాజకీయాలు చేయొద్దని హెచ్చరించారు. ఇటీవల కందుకూరు పట్టణంలో ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంపై అధికార పార్టీ వ్యక్తులు దాడి చేశారంటూ కొందరు కట్టుకథలు ప్రచారం చేశారని ఎమ్మెల్యే ఫైర్ అయ్యారు. అందులో ఎలాంటి రాజకీయ కుట్ర లేదని పోలీసులే తేల్చారన్నారు. దాడులు చేసే సంస్కృతి తమది కాదని, ఇకపై మాట్లాడే ముందు ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని ఆమ్ ఆద్మీ పార్టీ జోనల్ ఇంచార్జ్ నేతి ఉమామహేశ్వరరావును ఉద్దేశించి ఎమ్మెల్యే వార్నింగ్ ఇచ్చారు. లేకుంటే ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. సోషల్ మీడియాలో విచక్షణ లేకుండా, ప్రజలను రెచ్చగొట్టేలా పోస్టులు పెడుతున్నారని అన్నారు. త్వరలో జరగబోయే కందుకూరు మున్సిపాలిటీ ఎన్నికలు, 2029 లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో కూడా ప్రజలు తమ వైపే ఉంటారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, లింగసముద్రం మండల పార్టీ అధ్యక్షులు పూరిమెట్ల గురునాథం, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగిర్ల నాగరాజు పాల్గొన్నారు..

# శ్రీ కాటమరాజు ఆలయ భూములు డ్రోన్ ద్వారా సర్వే నిర్ణయించాలి





(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 24)

శ్రీ కాటమరాజు దేవస్థాన అభివృద్ధి గురించి ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మ గంగరాజు యాదవ్, ఆలయం ముఖ్య బాధ్యులు పిఎల్పి యాదవ్ మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రవీందర్ రెడ్డికి గురువారం వినతిపత్రం ఇవ్వడం జరిగింది. గతంలో 26 -4 -2025వ తేదీన సబ్ కలెక్టర్ మార్కాపురం వారికి కాటంరాజు ఆలయ భూముల పరిధిని డ్రోన్ సర్వే ద్వారా నిర్ణయించాలని కోరారు. అంతేగాక త్వరలో పూర్తికానున్న వెలుగొండ ప్రాజెక్టు కారణంగా మార్కాపురం వైపు నుంచి కాటమరాజు దేవస్థానానికి వెళ్లే దారి ఆపివేయబడుతున్న పరిస్థితుల్లో ప్రతి గురు ఆదివారాల్లో వందల సంఖ్యలో ఆలయ సందర్శనకు వెళ్లి మొక్కులు తీర్చుకుంటునటువంటి భక్తులకు భవిష్యత్తులో తీవ్రమైన అసౌకర్యం కలుగుతుందని కేవలం కంభం మాగుటూరు దారిలో మాత్రమే వెళ్లే పరిస్థితి ఉందని అది పుల్లలచెరువు,గుంటూరు , విజయవాడ, ఒంగోలు ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అనేక ఇబ్బందులు ఉంటుందని సంబంధిత అధికారికి తెలియజేయడం జరిగింది. మార్కాపురం సబ్ కలెక్టర్‌కి వినతి పత్రం ఇచ్చిన అనంతరం జూన్ నెల 5వ తేదీన మార్కాపురం డివిజనల్ ఫారెస్ట్ అధికారికి కూడా రెవిన్యూ ఫారెస్ట్ అధికారులు కలిసి డ్రోన్ సర్వేలో పాల్గొని ఆలయ పరిసరాలను నిర్దేశించి హద్దురాలను వేయించవలసిందిగా మనవి చేసి ఉన్నారు. కానీ సుమారు మూడు నెలలు కాలం గడిచినప్పటికీ డ్రోన్ సర్వే కార్యక్రమం రూపకల్పన చేయకపోవడంతో సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సంప్రదించి త్వరలో సర్వేలు నిర్వహించాల్సిందిగా మనవి చేశారు. కాటమరాజు తిరుణాల జరుగక ముందే మనం వినతి పత్రం అందజేశామని, అప్పటినుంచి సబ్ కలెక్టర్ ఎంతో చొరవ చూపి తిరుణాల నిర్వహణలో గాని ఏర్పాటలో గాని అన్ని శాఖలతో సమావేశాలు ఏర్పాటు చేసి నిర్విఘ్నంగా తిరుణాలను నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసి ఉన్నారు. కానీ ఫారెస్ట్ అధికారుల యొక్క అనేకమైన ఆక్షేపణల కారణంగా విధివిధానాల వల్ల ఆలయం పరిసరాల్లో భక్తుల సౌకర్యార్థం చేయాల్సినటువంటి వసతులను ఏర్పాటు చేయలేకపోతున్నామని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కు తెలియజేయడం జరిగింది. ఏవో సూచనల ప్రకారం ఆలయ కమిటీ చైర్మన్ గంగరాజు ఆలయ ముఖ్య బాధ్యులు పి ఎల్ పి యాదవ్ బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు ఇల్లూరి రంగస్వామి గౌడ్ ఆలయ కమిటీ సభ్యుడు నాయుడుపల్లె బోరిగోర్ల గాలయ్య యాదవ్, నక్క శ్రీనివాస్ యాదవ్ తోకల ఎల్లయ్య యాదవ్ మరికొందరు కమిటీ సభ్యులు పెద్దారవీడు మండల తాసిల్దార్ శైలేంద్ర కుమార్ కు వినతి పత్రాన్ని ఇచ్చారు. శైలేంద్ర కుమార్ మాట్లాడుతూ ఆలయ కమిటీ పరిసరాల యొక్క సర్వేను డ్రోన్ ద్వారా జరిపించమని, మిగతా అన్ని విషయాలను పరిశీలించమని తమకు ఆదేశాలు అందేయని, వెంటనే తగు చర్యల కోసం తమ సర్వేలకు సిబ్బందికి ఆదేశాలు జారీ చేసి వీలునంత త్వరగా సర్వేలు నిర్వహించడంతోపాటు ఆలయానికి పెద్దారవీడు మండలం ద్వారా వెళ్లే దారుల గురించి కూడా విచారిస్తామని హామీ ఇచ్చారు.

# బాల్య వివాహాలు చేస్తే రెండేళ్ల జైలు

కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి




(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 24)

బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలకు ముంగిపు పలుదాం అనే నినాదంతో బాల్యవివాహాలు లేని జిల్లాగా రూపుదిద్దడం కోసం ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కనిగిరి ఆర్ డి ఓ కేశవర్ధన రెడ్డి పిలుపునిచ్చారు.మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పక్షోత్సవాలు కార్యక్రమంలో భాగంగా గురువారం కనిగిరి పట్టణంలోని ఆర్ డి ఓ కార్యాలయం ప్రాంగణంలో బంగారు బాల్యం కమిటి, సార్డ్స్ సంస్థ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు – బాలల అక్రమ రవాణా పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ డి ఓ మాట్లాడుతూ బాల్యవివాహాలను చేసిన, ప్రోత్సహించిన వారికి రెండేళ్ల జైలు,రూ.లక్ష జరిమానా విధించడం జరుగుతుందన్నారు.పిల్ల ల అక్రమంగా రవాణా చేయడం అనేది తీవ్రమైన నేరం, ఇది వారి శారీరక,మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ అన్నారు.అలాగే, పిల్లలకు వారి హక్కుల గురించి అవగాహన కల్పించాలని బాలల అక్రమ రవాణా లాంటి నేరాలను నిరోధించడానికి, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రజలందరూ కలిసికట్టుగా కృషి చేయాలని అన్నారు.కనిగిరి ఎం ఆర్ఓ ఎవి రవిశంకర్ మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నా, బాలల అక్రమ రవాణా జరుగుతున్నట్లు అనుమానం వచ్చినా వెంటనే టోల్ ఫ్రీ నెంబర్లు 1098, 100, 112 కు కాల్ చేయాలని అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో పిల్లి రమణా రెడ్డి, ఏరువారి పల్లి సర్పంచ్ దమ్ము వెంకటయ్య, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు, జి ఎస్ అండ్ జిడికె ఫౌండేషన్ కోఆర్డినేటర్ నవకుమార్, సార్డ్స్ ప్రతినిధులు ఎలీషా, పవన్, కూటమి నాయకులు తమ్మినేని శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి, బారాయిమాం, యడవల్లి మనోజ్, రిజ్వాన్, తదితరులు పాల్గొన్నారు.

# గుర్రం జాషువా వర్ధంతి నిర్వహించిన ఎంఆర్పిఎస్ నాయకులు

(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 24)

నవయుగ కవి చక్రవర్తి కవికోకిల గుర్రం జాషువా వర్ధంతి కార్యక్రమాన్ని ఎంఆర్పిఎస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొదట గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఆర్పిఎస్ రాష్ట్ర నాయకులు పానుగంటి షాలెం రాజు మాట్లాడుతూ దళిత వర్గాలలో జన్మించి ఆయన కవిత సాహిత్యంతో సమాజంలో ఉన్న అన్ని కుల రక్కసి అసమానతులపై గళం విప్పిన మొట్టమొదటి వ్యక్తి గుర్రం జాషువా అని కొనియాడారు. ఆయన సాహిత్యాలు నేటికీ చెరిగిపోని ముద్రను వేశాయని కవి కోకిల నవయుగ కవి చక్రవర్తి గా గుర్తింపు పొందిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంద్రపాటి ప్రభుదాస్ లింగయ్య బండారు నెమిలిగుండం ఎమ్మార్పీఎస్ నాయకులు నేదరపల్లి జయరాజ్, భాస్కర్, ప్రభాకర్, సూరి, బాబ్జి, పాల్ నరసయ్య, రమేష్, రామయ్య, తదితరులు పాల్గొన్నారు.



# తల్లికి వందనం లబ్ధిదారులతో మమేకమైన కందుల వసంతలక్ష్మి





**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జులై 24)**
మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంత లక్ష్మి పట్టణంలోని 8వ వార్డులో తల్లికి వందనం లబ్ధిదారులతో మమేకమై ముచ్చటించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో కుటుంబంలో ఒక్కరికి మాత్రమే అమ్మఒడి వచ్చేదని, ఇప్పుడు తల్లికి వందనం పథకంలో కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉన్న అందరికీ తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల తల్లుల అకౌంట్లో డబ్బు జమ చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిలకు తమ కృతజ్ఞతలు తెలియజేశారు. తొలుత వార్డులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఫ్లెక్సీకి మహిళలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వార్డులో మహిళలు కేక్‌ను కట్ చేసి తమ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు తెలుగుదేశం నాయకులు, మహిళలు, తల్లికి వందనం లబ్ధిదారులు పాల్గొన్నారు.

## హరిహర వీరమల్లు సినిమాని తిలకించిన ఎమ్మెల్యే విజయకుమార్






**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 24)**
ఉపముఖ్యమంత్రి, పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రాన్ని వీక్షించేందుకు సంతనూతలపాడు ఎమ్మెల్యే బి.ఎన్.విజయ్‌కుమార్, జనసేన పార్టీ నాయకులు పేర్నమిట్ట నుంచి ర్యాలీగా బయలుదేరి చిత్రం ప్రదర్శింపబడుతున్న కర్నూలు రోడ్డులోని సాయిసరోజ్ మయూరి థియేటర్‌కు చేరుకున్నారు. పేర్నమిట్ట నుంచి జనసేన నాయకులు ద్విచక్ర వాహనర్యాలీగా బయలుదేరి మంగమూరు రోడ్డులోని ఎమ్మెల్యే బి.ఎన్.విజయ్‌కుమార్ కార్యాలయం వరకు చేరుకొని అక్కడి నుంచి ర్యాలీగా థియేటర్‌కు చేరుకున్నారు. ఎమ్మెల్యే బి.ఎన్.విజయ్‌కుమార్ జనసేన నాయకులతో కలిసి సినిమాను వీక్షించారు. ఈ కార్యక్రమంలో మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్, జనసేన పార్టీ నాయకులు కందుకూరి బాబు, చీమకుర్తి రాము, పేర్నమిట్ట పవన్, మద్దిపాడు మండల తెలుగు యువత మాజీ అధ్యక్షులు పోతినేని శ్రీనివాసరావు, మండవ మురళి కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

# సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జులై 24)**
మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి వసంతలక్ష్మి మార్కాపురం పట్టణం, మార్కాపురం మండలంలో గతంలో అనారోగ్యంతో హాస్పిటల్లో చికిత్స తీసుకొని కోలుకున్న వారికి స్వయంగా వారి ఇండ్ల వద్దకు వెళ్లి సీఎం సహాయనిధి చెక్కులను గురువారం అందజేశారు. చెక్కులు అందుకున్న వారిలో విప్పర్ల కొండలరావు (పెద్ద యాచవరం) రూ.1,75,000, రావి చిన్నక్క (రాయవరం) రూ.30,786, మార్కాపురం టౌన్ నూనె వెంకటరెడ్డి రూ.1,40,600, మారంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి రూ.26,084, మాలేపాటి గురవయ్య రూ.79,000, డొక్కా భవ్య రూ.45,000, సయ్యద్ హిదయతుల్లా రూ.37,000, వెరసి రూ.5,34,375 ల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







# సొసైటీ పరిధిలోని లీజు చెరువులు సొసైటీ సభ్యులకే ఇవ్వాలి

మారం రవికుమార్



**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జులై 24)**
పట్టణంలోని బెస్తపాలెంలో రాములవారి గుడి ఆవరణలో గురువారం జరిగిన ది బాపట్ల ఫిషర్మెన్ కోపరేటివ్ సొసైటీ 80వ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. సొసైటీ అధ్యక్షులు మారం రవికుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సొసైటీ ఏర్పడి నేటికీ 80 సంవత్సరం సందర్భంగా వేడుకలు జరుపుకున్నారు. మాజీ ప్రెసిడెంట్ మారం రామకృష్ణారావు, మెంబర్స్ మాట్లాడుతూ సొసైటీ పరిధిలో గల చెరువులను సొసైటీలకు లీజుకి ఇవ్వకుండా పంచాయతీ సెక్రెటరీస్ కి ఎన్నిసార్లు అర్జీలు పెట్టిన చెరువులు సొసైటీకి లీజులకి ఇవ్వకుండా వాళ్ల జోబులను నింపుకుంటున్నారు. దయుంచి మా బైలా పరిధిలో గల సొసైటీ చెరువులను సొసైటీకి లీజుకి ఇచ్చి సొసైటీ అభివృద్ధికి తోడ్పడవలసిందిగా ది బాపట్ల ఫిషర్మెన్ కోపరేటివ్ సొసైటీ బాపట్ల అధికారులను కోరారు. బాపట్ల, కర్లపాలెం పెద్ద గొల్లపాలెం, తుమ్మలపల్లి, ప్యార్లి, ప్యార్లిపాడు, చింతాయపాలెం, పెద్ద పులుగు వారి పాలెం, యాజలి, గుడిపూడి, నల్లమోతు వారి పాలెం, వెదులపల్లి, సమ్మెటవారిపాలెం గల చెరువులు సొసైటి వారికి లీజులకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని వారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గొల్ల శివ బాబు, మారం వీరరాఘవులు, గొల్ల ఏకాక్షరి, పాశం భవన నారాయణ, గొల్ల పంచాక్షరి, వద్ది సుబ్బారావు, సాదు వెంకటస్వామిలను సొసైటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పెద్దలకు సొసైటీ సభ్యులకు, సొసైటీ సభ్యులు మారం రవికుమార్ ధన్యవాదాలు తెలిపారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం

### మరో మూడు రోజులు పాటు వర్షాలు






**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 24)**
తెలుగు రాష్ట్రాలు తడిసి ముద్దవుతున్నాయి. వరుసగా కురుస్తున్న వర్షాల పైన వాతావరణ శాఖ తాజా అప్డేట్ ఇచ్చింది. ఉత్తర బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుండటంతో నేడు అల్పపీడనం ఏర్పడే అవకాశముందని అంచనా వేసింది. దీంతో రాబోయే నాలుగైదు రోజుల పాటు కోస్తాంధ్రలోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది. ఉత్తర కోస్తా వెంబడి గంటకు 50 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. ఒంగోలులో బుధవారం సాయంత్రం కురిసిన వర్షంకు వాహనదారులు తడిసి ముద్దయ్యారు.

## మార్కాపురం డివిజన్ పరిధిలో ఏపీసిపిడిసిఎల్ అధికారుల సమీక్ష





**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 24)**
పట్టణంలోని సౌజన్య ఫంక్షన్ హాల్‌లో ఏపీ సీపీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పి పుల్లారెడ్డి, ఏపీ సీపీడీసీఎల్ డైరెక్టర్ టెక్నికల్ మురళీ కృష్ణ యాదవ్‌లు మార్కాపురం డివిజన్ విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో మార్కాపూర్ డివిజన్లోని విద్యుత్ అధికారులు విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని తెలియజేశారు. విద్యుత్ లైన్లు ఎప్పటికప్పుడు మరమ్మత్తులు నిర్వహించి విద్యుత్ అంతరాయము తగ్గించాలని సూచించారు. డివిజన్లో 43 కోట్ల ప్రైవేట్ విద్యుత్ బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలని సూచించారు. డివిజన్లో 3,300 వ్యాపార సర్వీసులకు, 856 గవర్నమెంట్ సర్వీసులకు స్మార్ట్ మీటర్ల బిగింపును త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. డివిజన్లో పెండింగ్‌లో ఉన్న 1057 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు త్వరగా పూర్తిచేసి రైతులకి సర్వీసులను తొందరగా అందించాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశం తర్వాత మార్కాపురం మండలంలో ఇడుపూరు గ్రామంలోని ఇండోర్ సబ్ స్టేషన్ ని సిఎండి తనిఖీ చేశారు. ఈ తనిఖీలో సబ్ స్టేషన్‌ను నెలవారి మరమ్మత్తులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశానికి విద్యుత్ శాఖ సూపర్డెంట్ ఇంజనీర్ కట్ట వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మార్కాపురం పివి నాగేశ్వరరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మార్కాపురం ఎస్ సియా నాయక్, ఏడిఈలు, వివిధ మండలాల ఏఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వెలుగు సిబ్బందిని అభినందించిన డీజీఎం

(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, జులై 24)

2025–26 ఆర్థిక సంవత్సరానికి కొండపి మండలం లోని ద్వాక్రా సంఘాలకు రూ.15 కోట్ల వరకు స్త్రీ నిధి రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని స్త్రీ నిధి జోనల్ స్థాయి అధికారి ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం కొండపి మండల డిఆర్‌డిఏ వెలుగు కార్యాలయంలో అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ బి గోపీనాథ్ అధ్యక్షతన మండలంలోని వివోఏలకు, గ్రామ సంఘ అధ్యక్షతన అధ్యక్షులకు సమావేశం జరిగింది. ఈ సమావేశం నకు ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనిధి జోనల్ స్థాయి అధికారి ఉమామహేశ్వ రరావు మాట్లాడుతూ స్త్రీ నిధి విభాగంలో జిల్లాలో మొత్తం 38 మండలాల్లో కొండేపి మండల అధికారుల పనితీరు 5 స్థానంలో ఉన్నదని, ఎపియం, వెలుగు సిబ్బందని ఆయన అభినందించారు. ఇదే పని తీరును కొనసాగిస్తూ ఇంకా ఇంప్రూవ్ చేసుకొనుటకు మండలంలో సిబ్బంది, వివోఏలు పనిచేయాలని సూచించారు. స్త్రీ నిధి రుణాలు విడుదల, రికవరీ శాతం బాగా ఉన్నందున వాస్తవానికి మండలానికి రూ.8 కోట్లు టార్గెట్ అయితే ఈ మండల పనితీరు బాగా ఉన్నందున రూ.15 కోట్ల వరకు పెంచి రుణాల విడుదల అవకాశం కల్పిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. మండలంలో రెండు మూడు గ్రామ సంఘాలలో రికవరీ కొంచెం తక్కువగా ఉన్నదని ఆ గ్రామ సంఘాలలో కూడా రికవరీనూటికి నూరు శాతం ఉండే విధంగా పని చేయాలని సూచించారు. అదే విధంగా మరో ముఖ్య అతిథి మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పి 4 పథకం పట్ల ప్రతి కుటుంబాన్ని, మహిళలను చైతన్యం చేసి ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు. తద్వారా

## ద్వాక్రా మహిళలకు రూ.15 కోట్ల వరకు స్త్రీ నిధి రుణాలు అవకాశం

### స్త్రీ నిధి డిజిఎం ఉమా మహేశ్వరరావు





సమాజం లో ఆర్థిక అసమానతలు తొలగించడం ప్రభుత్వం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఏపిఎం బి గోపీనాథ్ సమావేశానికి హాజరైన వివోఏలకు, గ్రామ సంఘ సభ్యులకు విపిఆర్‌పి కార్యక్రమంపై శిక్షణ ఇస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో గ్రామస్థాయిలో ఉన్నటువంటి ప్రతి కుటుంబానికి, కావలసినటువంటి, వ్యక్తిగత అవసరాలు అయినా జాబ్ కార్డు హెల్త్ కార్డు విద్యుత్ సౌకర్యం పెన్షన్లు మొదలగునవి ఉన్నాయా, లేదా అని ఈ ప్రణాళిక ద్వారా గుర్తించాలని తెలిపారు. గ్రామస్థాయిలో కావలసినటువంటి సామాజిక అవసరాలు అయిన భవనాలు, రోడ్లు, మురుగు కల్వలు, మంచి నీటి వసతి మొదలగు అవసరాలు గుర్తించి ప్రణాళికలు తయారుచేసి మొబైల్ లో ఇచ్చిన యాప్ ద్వారా ప్రభుత్వానికి వివేదించేందుకు వివోఏలు బాధ్యత తీసుకొని పనిచేయాలన్నారు. టాటా ట్రస్ట్ నుండి ప్రాజెక్ట్ అసోసియేట్ ప్రభాకర్ గారు మాట్లాడుతూ, ప్రస్తుత రకరకాల రాసాయనాల వస్తువులు వాడటం వల్ల ప్రజలు అనారోగ్యం పాలు అవుతున్నారని, పోర్ట్ ఫైడ్ వస్తువులను ఉపయోగించుకొని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు.

సంస్థల ఆడిటింగ్, పుస్తకాలు, రికార్డుల నిర్వహణ పై డిఎంజి మాధవరావు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ కార్యవర్గ సభ్యులు కామేశ్వరి, సెక్రెటరీ బొద్దులూరి సుభాషిణిలు, సిసిలు డి మల్లికార్జునరావు, కృష్ణారెడ్డి, గోవిందమ్మ, రమణమ్మ, కోటేశ్వరమ్మ, మండలంలోని అన్ని గ్రామాల ఓబి సభ్యులు, విఓఏలు పాల్గొన్నారు.

## హరిహర వీరమల్లు చిత్రం ఘనవిజయం

### ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు





(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జులై 24)

ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు, అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు బాపట్ల జనసేన నాయకులు విన్నకోట సురేష్ జనసేన అధినేత, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రాన్ని మొదటి రోజైన గురువారం బాపట్లలో ఎమ్మెల్యే నరేంద్ర వర్మతో కలిసి జనసేన నాయకులు విన్నకోట సురేష్ తిలకించారు. చిత్రం విడుదల సందర్భంగా భారీ కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్ అభిమానులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా విన్నకోట సురేష్ మాట్లాడుతూబీ చరిత్ర ఆధారంగా తెరకెక్కిన హరిహర వీరమల్లు చిత్రం ప్రేక్షకులను అలరిస్తోందని చెప్పారు. ఈ చిత్రం అద్భుతమైన విజయం సాధిస్తుందని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ నటనతో మరోసారి ప్రేక్షకుల హృదయాలు కొల్లగొట్టారని, ఇది కుటుంబ సమేతంగా చూడదగిన చిత్రమని చెప్పారు ఈ కార్యక్రమంలో బాపట్ల ఏఎంసీ ఛైర్మన్ కావూరి శ్రీనివాస రెడ్డి, జనసేన పార్టీ కర్లపాలెం మండల అధ్యక్షులు మరియు ఏఎంసీ డైరెక్టర్ గొట్టిపాటి శ్రీకృష్ణ , కారుమూరి అంజనేష్, పసుపులేటి మహేష్, విష్ణుమొలకల చంద్రమోహన్, పడమటి ధర్మారావు గౌడ్, నవబోతూ తేజ, ఈమని మణిదీప్, కొక్కిరాల రాజేంద్ర, నరేంద్ర, చైతన్య, కిషోర్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికా సదన్ నిర్వహణ లోపం పై ఎమ్మెల్యే ఆగ్రహం

ఆకస్మికంగా తనిఖీ

పిల్లలు ఏ సమస్య ఉన్న తనను సంప్రదించవచ్చు

కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు







(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 24)

కందుకూరు పట్టణంలోని మార్కండేయ స్వామి గుడి వెనుక వైపు ఉన్న బాలికా సదన్ ను స్థానిక శాసనసభ్యులు శ్రీ ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సదన్ లో ఉన్న చిన్న చిన్న బాలికలు తమ బట్టలను స్వయంగా ఉతుక్కోవడం, అలాగే పరిసరాలు మురికి చెత్తతో నిండి ఉండడాన్ని చూసి ఇంచార్జ్ వార్డెన్ పై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనిఖీ సందర్భంగా బాలికలతో మాట్లాడిన ఎమ్మెల్యే మీకు ఏ సమస్య ఉన్నా నాకు తెలియజేయాలని చెప్పారు.. పిల్లలకి అందుతున్న వసతులు, భోజన ప్రమాణాలు, పరిశుభ్రత వంటి అంశాలపై వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు బాలిక సదన్ కు సంబంధించిన రికార్డులను ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంకోసారి ఇక్కడ ఇలాంటి వాతావరణం పునరావృతం కాకుండా చూసుకోవాలని, ఎప్పటికప్పుడు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇంత చిన్న వయస్సులో బాలికలే బట్టలు స్వయంగా ఉతుక్కోవటం పై కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. వార్డెన్‌తో పాటు సంబంధిత సిబ్బంది పై సీరియస్‌గా స్పందించిన ఆయన, విధులను సక్రమంగా నిర్వహించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## బాబు షూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 24)

మండల కేంద్రమైన ఉలవపాడు హైస్కూల్ సంఘం పరిధిలోనీ రెండవ వార్డులో గురువారం బాబు షూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం మండల వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నన్నం పోతురాజు, పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ వెలిచర్ల ధనకోటి, రాష్ట్ర యువజన జాయింట్ సెక్రెటరీ తోట మల్లికార్జునరావు, నియోజవర్గ యూత్ అధ్యక్షుడు మద్దసాని నవీన్, నియోజవర్గ ఎంప్లాయిస్, పెన్షనర్స్ విభాగం అధ్యక్షులు మర్లపాటి ఆదాం, మాజీ జడ్పిటిసి కోటు కోటిలింగం, వేమూరి వెంకన్న, దాసరి తిరుపాలు, జంపని అనురాధ , చేజర్ల వెంకట్రామిరెడ్డి, అమ్మనబ్రోలు శ్రీనివాస్, ఎర్రజొన్న మాధవరావు, మానం సుబ్బారావు, సయ్యద్ దస్తగిరి, రావినూతల వీరేంద్ర, కామంచి రవి, కాకి ఇమాన్యులు, పుణ్య పల్లి మాలకొండయ్య, సయ్యద్ సాహుల్, మదన్ మోహన్, ఏడుకొండలు, సోషల్ మీడియా సుల్తాన్, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## బాలుర వసతి గృహాన్ని సందర్శించిన జాయింట్ కలెక్టర్ కార్తిక్

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 24)

మండల కేంద్రమైన ఉలవపాడులోని బాలుర వసతి గృహంను , ప్రభుత్వ హైస్కూల్‌ను నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తిక్, కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కార్తిక్, మాట్లాడుతూ ఇండో సోలార్ కంపెనీ సిఎస్ఆర్ ఫండ్స్ కింద బాలుర నూతన వసతి గృహము నిర్మించడం మరియు హైస్కూల్లో యూకేజీ నుండి టెన్త్ క్లాస్ వరకు 1000 మందికి సరిపడా క్లాస్ రూములు ప్లే గ్రౌండ్, స్పోర్ట్స్ మెటీరియల్, ఇతర వసతులను ఏర్పాటు చేయడం కోసం స్థలం పరిశీలనకు విజిట్ చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇండో సోలార్ అధికారులు, ఎమ్మార్వో టి. శ్రీనివాసరావు, ఎంఈఓ రమణయ్య, ఎస్ఐ కె అంకమ్మ, విఆర్వో పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.





## నల్లబర్లీ పొగాకు రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 24)

జిల్లాలోని పొగాకు కొనుగోలు కేంద్రాల వద్ద నల్లబర్లీ పొగాకు రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను పటిష్టంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ మార్క్ ఫెడ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం ఒంగోలు కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో జాయింట్ కలెక్టర్ గోపాల కృష్ణ జిల్లా స్థాయి పొగాకు కొనుగోలు కమిటీ సభ్యలతో సమావేశమై నల్లబర్లీ పొగాకు కొనుగోలు పై సమీక్షించి పలు అంశాలను ఆమోదించడం జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, నల్లబర్లీ పొగాకు రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. నల్ల బర్లీ పొగాకు పండించే చిన్న, సన్న కారు రైతులు ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆగష్టు 10 వ తేదీ వరకు కు రీ షెడ్యూల్ చేయడం జరిగిందని, అందుకనుగుణంగా పొగాకు రైతుల నుండి మార్క్ ఫెడ్ ద్వారా నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. తొలి విడతలో ఒక రైతు వద్ద నుండి 2 మెట్రిక్ టన్నులు గాని లేదా 20 క్వింటాళ్ళు గాని కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను జారీచేసిందన్నారు. కొనుగోలు ప్రక్రియ తక్కువ క్వింటాళ్ళు నుండి ఎక్కువ క్వింటాళ్ల కలిగిన రైతునుండి ఆరోహణ క్రమంలో 20 క్వింటాళ్ల కు మించకుండా కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ప్రకాశం జిల్లాకు 800 మెట్రిక్ టన్నుల పొగాకు కొనుగోలుకు అనుమతివ్వగా, ఇప్పటివరకు జిల్లాలో 5.64 కోట్ల రూపాయల విలువ గల 677 మెట్రిక్ టన్నుల పొగాకును 245 మంది రైతుల వద్ద నుండి కొనుగోలు చేయడం జరిగిందన్నారు. నల్ల బర్లీ పొగాకు రైతులు నష్ట పోకుండా మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలుకు చర్యలు చేపట్టడం జరిగిందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎక్కడైనా కొత్త కొనుగోలు కేంద్రాల ఏర్పాటు అవసరమైతే, ప్రతిపాదనలను పంపినట్లైతే కొత్త కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. 20 శాతంకు మించి తేమ శాతం ఉండరాదని, ఈ విషయమై రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్ మరియు మండల వ్యవసాయ శాఖ అధికారుల పై ఉందన్నారు. రైతులు పొగాకు బేళ్ళను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన తరువాత తేమ శాతం 20 శాతం కంటే ఎక్కువ ఉందని తిప్పిపంపకుండా, కొనుగోలు కేంద్రాలకు తీసుకు రాకముందే పొగాకు తేమ శాతం 20 శాతం లోపు ఉండేలా రైతుల్లో అవగాహన కల్పించాల్సిన భాధ్యత విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్ ఉందన్నారు. పొగాకు రైతులకు గ్రేడింగ్ మీద అవగాహన కల్పించాలని, జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి సూచనలను జారీచేశారు. రైతుల వద్ద కొను పొగాకు నాణ్యతలో, ప్రమాణాల బాధ్యత, బయ్యర్లకు, ప్రాజెక్ట్ మేనేజర్లకు అప్పగించటం జరిగినదని తెలియజేశారు. గోడౌన్ యొక్క నిల్వకు సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు వచ్చునంత వరకు గోడౌన్‌లలో నిల్వవుంచిన పొగాకు యొక్క నాణ్యత, పరిమాణం యొక్క బాధ్యతను గోడౌన్ మేనేజర్‌కు, సొసైటీ ఇన్చార్జ్ కి అప్పగించటం జరిగినదని తెలియజేశారు. పొగాకు రైతులకు మేలు చేకూరేలా పొగాకు కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నీ చర్యలు తీసుకోవడం జరుగుచున్నదని తెలిపారు. ఈ సమావేశంలో మార్క్‌ఫెడ్ డిఎం హరిక్రిష్ణ, జిల్లా సహకార శాఖాధికారి ఇందిరా దేవి, వ్యవసాయశాఖ అధికారులు, మార్కెటింగ్, లీగల్ మెట్రాలాజీ శాఖ అధికారులు, ఎస్‌డబ్ల్యూసి, సిడబ్ల్యూసి మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com